
సాక్షి
ప్రకాశం
శనివారం । 27 । సెప్టెంబర్ । 2025



ఉసురుతీసిన కాలేజీ బస్సు

ప్రైవేటు కాలేజీ బస్సు బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు బీటెక్ విద్యార్థులు దుర్మరణం చెందిన ఘటన పొదిలి మండలంలో జరిగింది. - 8లో..



బౌద్ధ స్థూపానికి బాగోగులు కరువు

దొనకొండ మండలం చందవరం వద్ద ఉన్న పురాతన బౌద్ధ స్థూపాన్ని పట్టించుకునే వారు లేక శిథిలావస్థకు చేరుతోంది. - 8లో..

గరిష్టం/కనిష్టం
28 /26

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు

'ధన'లక్ష్మీ పాహిమాం..



● రూ.1.26 కోట్లతో ధనలక్ష్మీదేవిగా అలంకరణ

గిద్దలూరు రూరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రకాశం జిల్లా గిద్దలూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని శుక్రవారం రాత్రి ధనలక్ష్మీ దేవిగా అలంకరించారు. రూ.1.26 కోట్ల విలువైన కరెన్సీ నోట్లతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

న్యూస్‌రీల్

భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



హర్షవర్ధన్ రాజు

ఒంగోలు టౌన్: జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఎలాంటి ఆపద వచ్చినా తక్షణ సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. నదులు, వాగులు వంకలు, చెరువుల వద్ద పికెట్లు ఏర్పాటు చేసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే సహాయక శిబిరాలను ఏర్పాటు చేయాలని, పునరావాస కేంద్రాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సముద్ర తీరం వెంబడి నివశిస్తున్న ప్రజలు ఆయా ప్రాంతాలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు కానీ తుఫాన్ షెల్టర్లకు వెళ్లాలని సూచించారు. తీరప్రాంత ప్రజలు పోలీసు, రెవెన్యూ అధికారుల సూచనలు, సలహాలను పాటించాలన్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందన్నారు. గాలులకు రోడ్లపై విరిగిపడిన చెట్లను వెంటనే తొలగించాలని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ మళ్లించాలని చెప్పారు. ఉధృతంగా ప్రవహించే నదీ పరీవాహక ప్రాంతాలలో గస్తీ నిర్వహించాలని, నీట మునిగిన రహదారుల వద్ద పికెట్లు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం 112కు కానీ పోలీసు వాట్సప్ నంబర్ 9121102266కు సమాచారం అందజేయాలని కోరారు.

28 నుంచి జూనియర్ కాలేజీలకు దసరా సెలవులు

ఒంగోలు సిటీ: ఇంటర్మీడియెట్ విద్యా మండలి అకడమిక్ క్యాలెండరు ప్రకారం జిల్లాలోని జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఈ నెల 28వ తేదీ నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించాలని ఆర్ఐఓ కె.ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలు కానీ స్పెషల్ క్లాసులు కానీ నిర్వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చీమకుర్తి మున్సిపాలిటీలో వార్డుల పెంపు

● 20 వార్డుల నుంచి 27కు పెంపు

చీమకుర్తి: చీమకుర్తి మున్సిపాలిటీలోని వార్డుల సంఖ్య 20 నుంచి 27కు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసినట్లు కమిషనర్ వై.రామకృష్ణయ్య శుక్రవారం తెలిపారు. ఇప్పటి వరకు 20 వార్డులు ఉండగా ఓటర్ల సంఖ్య పెరగటంతో అదనంగా మరో 7 వార్డులను పెంచినట్లు అయింది. మొట్టమొదట నగర పంచాయతీగా ఉన్న చీమకుర్తి రెండేళ్ల క్రితం గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ కావడం, ఓటర్ల సంఖ్య పెరగటంతో ప్రస్తుతం ఉన్న పాలకవర్గం రాష్ట్ర మున్సిపల్ కార్యాలయానికి పంపించిన ప్రతిపాదనలు ఆమోదం పొందటంతో రానున్న మున్సిపల్ ఎన్నికల నాటికి 27 వార్డుల్లో 27 మంది కౌన్సిలర్‌లను ఎన్నుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న వార్డుల్లో సరాసరిన ఒక్కో వార్డుకు 1000 మంది నుంచి 1150 మంది ఓటర్ల వరకు ఉండేవారు. 27 వార్డులకు పెరగటంతో వారి సంఖ్య 800 నుంచి 850 మంది ఓటర్ల మధ్య ఉండే అవకాశం ఉందని కమిషనర్ తెలిపారు. ఇప్పుడున్న మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలపరిమితి వచ్చే ఏడాది మార్చినెల 17తో ముగియనుంది. దాదాపు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావచ్చని స్థానిక నాయకులు అంచనా వేస్తున్నారు.

అందరికీ వరాల్చి ఆదుకునే దేవుడికే సమస్య వచ్చింది. అన్యాక్రాంతమవుతున్న తన భూములను రక్షించుకోలేక పోతున్నాడు. ఈ భూమి నాదే అంటూ న్యాయస్థానానికి మొరపెట్టుకుంటున్నాడు. కోట్లు విలువజేసే భూములున్నా ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాల దాతలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి చెందిన భూములను నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం ఒంగోలు డెయిరీకి ఇచ్చేసింది. ఈ భూములపై తమకు హక్కు ఉందంటూ కొంత మంది అత్యాశపరులు హైకోర్టుకెక్కారు.



పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం



దేవస్థానం భూమిలో నిర్మించిన ఒంగోలు డెయిరీ భవనం


దేవునికే పాలుపోక!

● వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం భూములు పరాధీనం
● ఆలయ భూమి 7.3 ఎకరాల్లో ఒంగోలు డెయిరీ నిర్మాణం
● భూమి విలువ సుమారు రూ.85 కోట్లు
● గత టీడీపీ ప్రభుత్వంలో రెవెన్యూ రికార్డులు తారుమారు
● భూమి రికార్డులు సరిచేయాలంటూ జేసీ కోర్టును ఆశ్రయించిన దేవస్థానం అధికారులు
● ఈ భూములపై హక్కు ఉందంటూ కొందరు హైకోర్టులో కేసు
● దేవుడి భూములు కాపాడాలని ప్రభుత్వ పెద్దలను కోరుతున్న భక్తులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం భూములకు రక్షణ లేకుండా పోయింది. స్వామి వారికి వేలాది ఎకరాలు ఉన్నా అవి అన్యాక్రాంతమై పరుల ఆధీనంలో ఉన్నాయి. ఆలయానికున్న ఆస్తులతో గుడికి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించే అవకాశం ఉన్నప్పటికీ అవి అన్యాక్రాంతమవడంతో దాతల సహకారంపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా దేవస్థానానికి చెందిన 7.30 ఎకరాల భూమి సంతనూతలపాడు మండల పరిధిలోని పేర్నమిట్టలో 128-1 సర్వే నంబరులో ఉంది. దాని విలువ రూ.85 కోట్లు పైనే ఉంది. ఆ భూమిలో ప్రభుత్వం డెయిరీని నిర్మించింది. ఇది కాకుండా తిరుపతి జిల్లా గూడూరులో 99 ఎకరాలు, మండలంలోని కనుమళ్ల పంచాయతీలో 98 ఎకరాల భూమి ఉంది. ఇవి కూడా ఆక్రమణలో ఉన్నాయి.

రికార్డులు తారుమారు

దేవస్థానం భూమి 7.30 ఎకరాల్లో ఒంగోలు సహకార డెయిరీని నిర్మించారు. ప్రకాశం జిల్లా పాడి ఉత్పత్తులదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో 1978లో దీనిని ప్రారంభించారు. సుమారు రెండు ఎకరాల స్థలంలో భవనాలు, మిషనరీ ఏర్పాటు చేయగా మిగిలిన స్థలం ఖాళీగా ఉందని దేవదాయ వర్గాలు తెలియజేస్తున్నాయి. ఈ విషయం తెలిసినా అప్పటి ఆలయాధికారులు పెద్దగా పట్టించుకోలేదు. 2013 ఇనాం అబాలిష్ చట్టం వచ్చిన తర్వాత అధికారులు ఈ భూమిని స్వాధీనం చేసుకునేందుకు దేవస్థానం అధికారులు ప్రయత్నించినప్పటికీ



రెవెన్యూ రికార్డు ఆర్ ఎస్ ఆర్ లో దేవస్థానం పేరుమీద భూమి ఉన్న దృశ్యం

ఆచరణ సాధ్యం కాలేదు. 2018 సమయంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం అడంగల్, వన్-బీలో మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీగా పేరు మార్చేసింది.



రెవెన్యూ రికార్డులు వన్- బీలో దేవుని పేరు మీద భూమి ఉన్న దృశ్యం

1905 సంవత్సరం నాటి (బ్రిటీష్ కాలంలోని) ఆర్ఎస్ఆర్‌లో మాత్రం వరాహలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పేరుమీద ఈ భూములు ఉన్నాయి. దీనిని ప్రభుత్వం మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీగా పేరు ఎలా మారుస్తుందని భక్తులు నిలదీస్తున్నారు.

జేసీ కోర్టులో కేసు..

దేవస్థానానికి చెందిన భూమిలో డెయిరీ నిర్మించడంపై జేసీ కోర్టులో కేసు దాఖలు చేశారు. దేవుడి భూముల హక్కును సైతం మార్చేయడంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు జేసీ కోర్టులో పలుసార్లు వాదనలు జరిగాయి. ఇదిలా ఉండగా ఏడు ఎకరాల భూమిలో ఎకరం భూమిపై తమకు హక్కులు ఉన్నాయంటూ కొందరు అత్యాశపరులు హైకోర్టులో కేసు నమోదు చేశారు. దీనిపై సంతనూతలపాడు మండల రెవెన్యూ అధికారులు సైతం ఆ భూములను పరిశీలించారు. దేవుని ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడతామని, ఇందు కోసం న్యాయపోరాటం చేస్తామని దేవస్థానం అధికారులు తెలియజేస్తున్నారు.

మూతపడిన డెయిరీ..

ప్రకాశం జిల్లా పాడి ఉత్పత్తులదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో డెయిరీ 1978లో ప్రారంభమైంది. రోజుకు 3.5 లక్షల లీటర్ల పాల సేకరణ సామర్థ్యంతో పాటు, 30 మెట్రిక్ టన్నుల పాలపొడి తయారీ యూనిట్, 20 మెట్రిక్ టన్నుల వెన్న తయారీ, 10 మెట్రిక్ టన్నుల నెయ్యి తయారీ సామర్థ్యంతో ఒంగోలు డెయిరీ ఉండేది. 278 పాల సహకార సంఘాల ద్వారా 35 వేల మంది పాడి రైతులు నిత్యం పాలుపోసేవారు. ఒక వెలుగు వెలిగిన ఈ డెయిరీ కాలక్రమంలో ఆర్థిక కష్టాల్లో చిక్కుకుని, రైతులకు బిల్లులు కూడా చెల్లించలేని దుస్థితికి చేరుకుంది. దీనినే నమ్ముకుని పనిచేసిన రెగ్యులర్, తాత్కాలిక సిబ్బంది 120 మంది రోడ్డున పడ్డారు. ప్రస్తుతం డెయిరీ కూడా మూలపడడంతో రూ.కోట్లు విలువజేసే భూములను తిరిగి దక్కించుకునేందుకు అధికారులు పోరాటం చేస్తున్నారు.

ఆధారాలు ఉన్నాయి..



జిల్లా డెయిరీ వరాహాలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం భూమిలో నిర్మించారు. ఆర్ ఎస్ఆర్ ప్రకారం పూర్తి ఆధారాలు ఉన్నాయి. కానీ కొందరు రెవెన్యూ అధికారుల మాయాజాలంతో దేవునికి చెందాల్సిన భూములకు హక్కుదారుగా అడంగల్, వన్-బీ లో మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీగా నమోదు చేశారు. ఈ భూములు దేవునికి దక్కేలా న్యాయపోరాటం చేస్తాం. ఇప్పటికే దీనిపై జేసీ కోర్టులో న్యాయ పోరాటం చేస్తున్నాం.

– పీ కృష్ణవేణి, ఈఓ, వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం



పుచ్చకాలయపల్లిలో నీటి మునిగిన మిరప మొక్కలు



మార్కాపురం చెరువు కట్ట వద్ద అలుగుపై ప్రవహిస్తున్న నీరు

పొంగిన వాగులు, వంకలు

● జిల్లా అంతటా ఎడతెరపిలేని వర్షం
● పలుచోట్ల రాకపోకలు బంద్
● మార్కాపురం మండలంలో కూలిన మట్టిమిద్దె

మార్కాపురం: మార్కాపురం ప్రాంతంలో శుక్రవారం వేకువజామున నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో పలుచోట్ల వాగులు, వంకలు పొంగి పారుతున్నాయి. మార్కాపురం, పెద్దారవీడు, యర్రగొండపాలెం, తర్లుపాడు, త్రిపురాంతకం తదితర ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. మార్కాపురం ప్రాంతంలో 21.6 మి.మీ, యర్రగొండపాలెంలో 38.6, పుల్లలచెరువులో 45.4, పెద్దారవీడులో 8.4, దోర్నాలలో 4.8, త్రిపురాంతకంలో 22.6, కంభంలో 5.4, బేస్తవారిపేటలో 3.8, అర్ధవీడులో 8.6, గిద్దలూరులో 1.6, తర్లుపాడులో 8.4, రాచర్లలో 2.2 మి.మీ వర్షం కురిసింది. దీనితో మార్కాపురం-కుంట మధ్య ఉన్న చెరువువాగు, కుంట-జమ్మనపల్లి మధ్య ఉన్న ఉప్పువాగు, మార్కాపురం చెరువుకట్టపై ఉన్న అలుగు ప్రాంతాల్లో రోడ్డుపై వర్షపు నీరు పారడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు తన సిబ్బందితో వాగులు రోడ్డుపై పారుతున్న ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసి ప్రమాదాలు జరగకుండా నివారించారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి కోలభీమునిపాడు గ్రామంలో డోలు కిరణ్ మట్టిమిద్దె కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అందరికీ ప్రాణాపాయం తప్పింది. అయితే ఇంట్లో ఉన్న బీరువా, ఇతర సామాన్లు రాళ్లుపడి ధ్వంసమయ్యాయి.



కోలభీమునిపాడులో వర్షానికి కూలిన మట్టిమిద్దె



ఐనముక్కలలో ఇంట్లోకి చేరిన వర్షం నీరు



యర్రగొండపాలెంలో గాయత్రి థియేటర్‌కు వెళ్లే దారిలో నిలిచిన నీరు



వేములకోట వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న నీటి ప్రవాహంలో రాకపోకలు ఆపిన రూరల్ ఎస్సై అంకమరావు

ప్రభుత్వ వైద్యుల పోరుబాట

● పీజీ కోటా కోసం సమ్మె ప్రారంభించినట్లు ప్రకటన
● ఆన్‌లైన్ రిపోర్టులు పంపించడం ఆపేసిన వైద్యులు

ఒంగోలు టౌన్: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ప్రభుత్వ వైద్యులు సమ్మె బాట పట్టారు. ఇన్ సర్వీస్ పీజీ కోటాను రద్దు చేయడంతో కొన్నాళ్లుగా దాన్ని పునరుద్ధరించాలని ప్రాథమిక వైద్యశాలల్లో పనిచేస్తున్న వైద్యులు కోరుతున్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అనివార్య పరిస్థితుల్లో శుక్రవారం నుంచి సమ్మెకు దిగినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాహుల్ తెలిపారు. రోజువారి విధుల్లో భాగంగా పంపించే ఆన్‌లైన్ రిపోర్టులను నిలిపేసినట్లు చెప్పారు. ఇన్ సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలని, టైం బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పని చేసే వైద్యులకు బేసిక్ పే 30 శాతం ట్రైబల్ అలవెన్స్, నేటివిటి అండ్ అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం ముందు డిమాండ్లు ఉంచినట్లు తెలిపారు. వైద్యులకు కచ్చితమైన పనిగంటలు, వారం తపు సెలవులు, స్పష్టమైన జాబ్ కార్డ్ ఇవ్వడం, నాన్ మెడికల్ వ్యక్తులు విచ్చలవిడిగా ఇన్‌స్పెక్ట్ చేయకుండా మార్గదర్శకాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలను ప్రభుత్వం ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తమ నిరసన ప్రజలపై కాదు, ప్రభుత్వ నిర్లక్ష్యంపైనే అని స్పష్టం చేశారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా వెనకడుగు వేయకుండా ప్రజలకు వైద్య సేవలను అందించామని, ప్రభుత్వం ప్రాథమిక వైద్యుల సమస్యలను పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.



కొనకనమిట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

బాలకృష్ణ వ్యాఖ్యలు సిగ్గుచేటు

● వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి




బత్తుల బ్రహ్మానందరెడ్డి

ఒంగోలు సిటీ: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పై, సినీ హీరో చిరంజీవిపై హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చిరంజీవి, జగన్ పట్ల బాలకృష్ణ అమర్యాదకరంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వారి గురించి మాట్లాడే అర్హత బాలకృష్ణకి లేదన్నారు. అసెంబ్లీ సాక్షిగా చేసిన ఆయన వ్యాఖ్యలపై సర్వత్రా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్లు తెలిపారు. టీడీపీ చంద్రబాబు చేతుల్లోకి వెళ్లటంతో బాలకృష్ణ ఏం మాట్లాడుతున్నాడో అర్థంకానీ అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడన్నారు. మీరు మాట్లాడే భాషను ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారనీ, భవిష్యత్ లో ఇటువంటి వ్యాఖ్యలు పునరావృతం అయితే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.

సభ్యసమాజం తలదించుకునేలా బాలకృష్ణ వ్యాఖ్యలు

● వైఎస్సార్ సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి



జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: అసెంబ్లీ వేదికగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, ప్రముఖ సినీ నటుడు చిరంజీవిపై ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమని ఏపీఐఐసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సభలో బాలకృష్ణ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి అమర్యాదకరంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వైఎస్ జగన్ గురించి మాట్లాడే నైతిక హక్కు బాలకృష్ణకు లేదన్నారు. చిరంజీవి, చంద్రబాబుతో విభేదాలుంటే వారితోనే బాలకృష్ణ తేల్చుకోవాలే తప్ప నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదని అన్నారు. అసెంబ్లీలో సభ్యసమాజం తలదించుకునేలా ఆయన మాట్లాడటం తగదని అన్నారు. ఇలా సభా మర్యాదలు పాటించకుండా మాట్లాడి ప్రజలకు ఏం సందేశం ఇవ్వాలని అనుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. సభలో ఎమ్మెల్యే బాలకృష్ణ తీరు చూశాక ఆయనకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేయాలేమో అనిపించేలా ఉందని అన్నారు. బాలకృష్ణ సొంత ఇంట్లో కాల్పులు జరిపి మెంటల్ సర్టిఫికెట్ తెచ్చుకున్న సంగతి తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ తెలుసునన్నారు. మాజీ సీఎం జగన్ గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని జంకె సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

బాలకృష్ణ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

● పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి



వై.ఎం. ప్రసాద్‌రెడ్డి

ఒంగోలు సిటీ: హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అసెంబ్లీలో అసభ్యకరంగా మాట్లాడటం మంచి పద్ధతి కాదని పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ చిరంజీవిపై, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బాలకృష్ణ అసెంబ్లీ వేదికగా అనుచితంగా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. చిరంజీవి అన్నా, మీరన్నా ఎంతో గౌరవం ఉండే వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. అటువంటి వ్యక్తిని సైకోగాడు అనడానికి మీకు మనస్సు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. మీకు మంత్రిపదవి రాలేదనే బాధతో లేదా పార్టీ చంద్రబాబునాయుడు చేతుల్లోకి పోయిందనే బాధల్లో జగన్‌మోహన్ రెడ్డిని అలా మాట్లాడటం తగదని విమర్శించారు. ప్రతి ఒక్కరినీ ఉన్నతంగా గౌరవంగా సంబోధించే ఏకైక వ్యక్తి జగన్ అని కొనియాడారు. బాలకృష్ణ అన్న మాటలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

క్లుప్తంగా

గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా శిద్దా సుధీర్


శిద్దా సుధీర్

చీమకుర్తి: చీమకుర్తిలోని గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా గోల్డెన్ గ్రానైట్ ఎండీ శిద్దా సుధీర్ కుమార్‌ను ఎన్నుకున్నారు. రెండు రోజుల క్రితం ఒంగోలులోని గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ గెస్ట్ హౌస్‌లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్-1గా శిద్దా భరత్, వైస్ ప్రెసిడెంట్-2గా శిల్పారెడ్డి, వైస్ ప్రెసిడెంట్-3గా ఆనంద్ శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా రవిచంద్రన్, జాయింట్ సెక్రటరీ-1గా భాస్కర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ-2గా నవీన్‌రెడ్డి, ట్రెజరర్‌గా చలువాది బదరీనారాయణను ఎన్నుకున్నారు. వారితో పాటు మరో 9 మంది గ్రానైట్ యజమానులను ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నుకున్నారు.

డీఈవో ఆదేశాలు బేఖాతారు


ఏపీ సాఫ్ట్‌బాల్ ఆర్గనైజింగ్ అసోసియేషన్ సభ్యులు, పీడీల మధ్య జరుగుతున్న వాగ్వాదం

ఒంగోలు టాస్క్‌ఫోర్స్: ప్రభుత్వ పాఠశాలల్లో ఎటువంటి ప్రైవేటు అసోసియేషన్లకు సంబంధించిన ఆటల పోటీలు, ఎంపికలు, సమావేశాలు నిర్వహించరాదని, అలాంటి కార్యక్రమాలకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు అనుమతులు ఇవ్వరాదని డీఈవో ఆదేశాలు జారీ చేసి ఉన్నారు. అయితే, ఆ ఆదేశాలను బేఖాతరు చేస్తూ టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శుక్రవారం ఏపీ సాఫ్ట్‌బాల్ ఆర్గనైజింగ్ అసోసియేషన్ వారికి పురుషులు, సబ్ జూనియర్స్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక కార్యక్రమానికి అనుమతివ్వడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై అసోసియేషన్ సభ్యులు, వ్యాయామ పీడీల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఎలాగైతేనేమీ అధికార పార్టీ నాయకుల అండదండలతో సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక కార్యక్రమం పూర్తయింది. దీనిపై ప్రైవేటు అసోసియేషన్ ఆటల పోటీలకు అనుమతులు ఎలా ఇస్తారని వ్యాయామ పీడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ సాఫ్ట్‌బాల్ ఆర్గనైజింగ్ అసోసియేషన్ వివాదాల్లో కోర్టులో ఉందని, అంతేగాకుండా అవకతవకలకు పాల్పడుతోందని అన్నారు. దీనిపై డీఈవోకు ఫిర్యాదు చేస్తామని పీడీలు తెలిపారు. దీనిపై డీఈవోను ఫోన్‌లో టంగుటూరు ఎంఈఓ సంప్రదించబోగా.. ఆయన అందుబాటులోకి రాలేదని తెలిసింది.

సీబీజీ ప్లాంటుకు భూములు సిద్ధం

ఒంగోలు సబర్బన్: కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్లాంట్ నిర్మాణానికి భూమి సిద్ధంగా ఉందని కలెక్టర్ పీ రాజాబాబు రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్ దృష్టికి తీసుకెళ్లారు. సీబీజీ ప్లాంట్ నిర్మాణంపై నెల్లూరు, ప్రకాశం, పల్నాడు, తిరుపతి జిల్లాల కలెక్టర్లతో చీఫ్ సెక్రటరీ విజయానంద్ శుక్రవారం రాజధాని అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సీబీజీ ప్లాంట్‌కి జిల్లాలో 4,993 ఎకరాల భూమి ఎంపిక చేశామని కలెక్టర్ తెలిపారు. మొదటి దశలో భూ సేకరణ పూర్తయిందన్నారు. కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి భూమి సమస్య ఏమీ లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే నెట్ క్యాప్, రిలయన్స్ సంస్థ సంయుక్తంగా ప్రకాశం జిల్లాలో సోలార్ పార్క్ నిర్మించనుందన్నారు. సోలార్ పార్క్ నిర్మాణానికి 90 వేల ఎకరాలు అవసరమని ప్రభుత్వం నుంచి అధికారికంగా లేఖలు అందాయన్నారు. ఇందుకోసం ప్రస్తుతం 55 వేల ఎకరాల భూమిని గుర్తించామని సీఎస్ కి వివరించారు.

ఇద్దరు బీటెక్ విద్యార్థుల ఉసురు తీసిన కాలేజీ బస్సు


సంఘటన స్థలంలో మృతదేహాలు


బంధువులు, గ్రామస్తుల విషాదం

- మృతులు వరుసకు అన్నదమ్ములు
- దసరాకు స్వగ్రామం వస్తుండగా ప్రమాదం
- కూలిన తల్లిదండ్రుల ఆశలు
- రోదిస్తున్న బంధువులు

పొదిలి:

దసరా పండగను స్వగ్రామంలో జరుపుకునేందుకు బయల్దేరిన ఇద్దరు బీటెక్ విద్యార్థులను ఓ కాలేజీ బస్సు పొట్టన పెట్టుకుంది. వరుసకు అన్నదమ్ములైన వీరు బైకుపై విజయవాడ నుంచి స్వగ్రామం హనుమంతునిపాడుకు బయల్దేరారు. ఈ క్రమంలో శుక్రవారం పోతవరం వద్ద ఓ కాలేజీ బస్సు ఢీకొనటంతో ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వివరాలు.. మచ్చా బ్రహ్మయ్య (19), బండ్లమూడి గురువిష్ణు (22) అక్కచెల్లెళ్ల కుమారులు. విజయవాడలో బీటెక్ చదువుతున్నారు. గురువిష్ణు కుటుంబం విజయవాడలోనే నివాసం ఉంటోంది. బ్రహ్మయ్య కుటుంబం హనుమంతునిపాడులో ఉంటోంది. దసరా పండగకు హనుమంతునిపాడులో గడిపేందుకు బైకుపై శుక్రవారం ఉదయం బయల్దేరారు. వేగంగా వస్తున్న కాలేజీ బస్సు యువకులను ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడే కిందపడి ప్రాణాలు కోల్పోయారు. మోటారు సైకిల్ దూరంగా పడి ఉంది. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాలను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణంగా భావిస్తున్న కాలేజీ బస్సును పోలీసుస్టేషన్‌కు తరలించారు.

భీతావహంగా సంఘటన స్థలం

ప్రమాద స్థలం భీతావహంగా మారింది. ఒక యువకుడి మెదడు చిదిరి రోడ్డంతా పడింది. వర్షం కురుస్తుండటంతో రక్తంతో రోడ్డంతా ఎరుపెక్కింది. మృతదేహాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. శరీర భాగాలు దూరంగా ఎగిరిపడ్డాయి. బ్యాగ్‌లు, పిండి ప్యాకెట్ సంఘటన స్థలంలో పడి ఉన్నాయి. తొలుత గుర్తు తెలియని వాహనంగా అనుకున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా ఓ ప్రైవేటు కాలేజీ బస్సు సంఘటనకు కారణంగా అనుమానించిన పోలీసులు ఆ దిశగా విచారణ చేయడంతో బస్సు వివరాలు తేలాయి. కంభాలపాడు వైపు నుంచి పిల్లలను ఎక్కించుకుని విశ్వనాథపురానికి వస్తున్న బస్సు మధ్యలో పోతవరం విద్యార్థులు చేయెత్తినా ఆపకుండా వెళ్లింది. ఈ క్రమంలో విద్యార్థులను విచారించగా బస్సే ప్రమాదానికి కారణమని తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పండగకు వస్తూ పరలోకాలకు..

మృతుల తల్లులు తిరుపతమ్మ, రమణమ్మలు అక్కాచెల్లెళ్లు. వీరిది వెలిగండ్ల మండలం పూలికుంట్ల. బ్రహ్మయ్య తల్లిదండ్రులు హనుమంతునిపాడులో నివాసం ఉంటున్నారు. ఇంటర్మీడియెట్ వరకు కనిగిరిలో చదివిన బ్రహ్మయ్య బీటెక్ చదివేందుకు విజయవాడలో చేరి హాస్టల్లో ఉంటున్నాడు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న బండ్లమూడి రాజా, రమణమ్మల కుమారుడైన విష్ణు విజయవాడలోనే బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. సెలవులు ఇవ్వడంతో విష్ణు, బ్రహ్మయ్యలు పండగ ఆనందంగా గడిపేందుకు వస్తుండగా బస్సు రూపంలో మృత్యువు కబళించింది. ప్రభుత్వ వైద్యశాలకు చేరిన బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కష్టపడి చదివించుకుంటున్న తమ పిల్లలు మృత్యువు పాలవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


వైద్యశాలలో రోదిస్తున్న బంధువులు



యువకులను ఢీకొట్టిన కాలేజీ బస్సు


సంఘటన స్థలంలో మోటార్ సైకిల్

ఒక ఓటు హక్కు మాత్రమే కలిగి ఉండాలి

- ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలి
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో డీఆర్వో ఓబులేసు


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్వో ఓబులేసు

ఒంగోలు సబర్బన్: ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతి ఓటరూ ఒక ఓటు మాత్రమే కలిగి ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) బి.చిన ఓబులేసు స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్లోని డీఆర్వో చాంబర్‌లో ఎన్నికల అధికారులతో కలిసి జిల్లాలో అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ తప్పులు లేని ఓటరు జాబితా తయారీ, పోలింగ్ శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, 18-19 ఏళ్ల వయసు గల యువతకు ఓటు నమోదు వంటి అంశాలపై సలహాలు, సూచనలు అందించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. రెండేసి ఓట్లు కలిగిన వారు వెంటనే ఒక ఓటును రద్దు చేసుకుని నివాసం ఉన్న చోట మాత్రమే ఓటు హక్కు కలిగి ఉండాలని ఓటర్లకు డీఆర్వో విజ్ఞప్తి చేశారు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోనివారంతా వెంటనే ఆధార్ అనుసంధానం చేసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఒంగోలు నగరం, జిల్లాలోని పట్టణాల్లో డోర్ నంబర్లు లేకుంటే డోర్ నంబర్లు వేసేలా అధికారులు దృష్టి సారించాలన్నారు. జిల్లాలో చనిపోయిన వారి ఓట్లను వెంటనే ఓటరు లిస్టు నుంచి తొలగించాలని సూచించారు. సమావేశంలో ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు కళావతి, కేశవర్ధనరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, ఏ కుమార్, వరకుమార్, సత్యనారాయణ, రవీంద్రారెడ్డి, జిల్లా ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, పొలిటికల్ పార్టీల ప్రతినిధులు వైఎస్సార్ సీపీ నుంచి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు వెంకటరావు, ఓ సైదా, ఓ రసూల్, గుర్రం సత్యం, రఘురామ్, సుదర్శన్, జిల్లా ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ వర్గీయులు బెయిల్‌పై విడుదల

- పరామర్శించిన చుండూరి రవిబాబు, నాయకులు


జిల్లా జైలు వద్ద ఉన్న చుండూరి రవిబాబు, కఠారి శంకర్, వైఎస్సార్ సీపీ నాయకులు

ఒంగోలు టౌన్: వినాయక చవితి పండుగ సందర్భంగా నిమజ్జన ఊరేగింపులో జరిగిన తోపులాట విషయంలో ఒంగోలు 45వ డివిజన్‌కు చెందిన గణేష్ భక్తులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించిన విషయం తెలిసిందే. ఈ కేసులో రిమాండ్‌లో ఉన్న మూరక నారాయణరెడ్డి, భూమిరెడ్డి తిరుపతిరెడ్డి, తమ్మినేని సిద్దారెడ్డి శుక్రవారం బెయిల్‌పై విడుదలయ్యారు. వారిని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు ఆధ్వర్యంలో పార్టీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్, డివిజన్ అధ్యక్షుడు మాల్యాద్రిరెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజేష్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు మలిశెట్టి దేవా జిల్లా జైలు వద్దకు వెళ్లి కలిసి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చుండూరి రవిబాబు భరోసా ఇచ్చారు.

సైకో అంటే గుర్తుకొచ్చేది బాలకృష్ణే

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

మార్కాపురం: శాసనసభలో గురువారం హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సైకో అంటూ విమర్శించడం మంచిపద్ధతి కాదని, సైకో అంటే గుర్తుకొచ్చేది బాలకృష్ణేనని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు జి. శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వ్యక్తిగతంగా దూషించడం బాధకలిగిస్తోందన్నారు. బాలకృష్ణ వద్దకు ఎవరైనా అభిమానులు వెళ్లి షేక్‌హ్యాండ్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తే చెంపలు పగులకొడతారన్నారు. ఒక్కో సారి దాడి కూడా చేస్తారన్నారు. గతంలో మీ ఇంట్లో కాల్పుల ఘటన ఎందుకు జరిగిందో.. ఎలా జరిగిందో.. మాకు తెలీదుకానీ జరిగిన సంఘటన వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న డాక్టర్ వైఎస్సార్ వద్దకు మీ కుటుంబం అంతా వెళ్లి సమస్యను వివరించడంతో ఆయన పెద్ద మనసుతో పరిష్కారం చేసిన విషయం గుర్తుచేసుకోవాలన్నారు. ఆ తర్వాత ఒక డాక్టర్ ద్వారా మెంటల్ సర్టిఫికెట్ కూడా తెచ్చుకున్నారని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉండి ఎన్‌టీ రామారావు సొంత జిల్లా కృష్ణ జిల్లాకు ఆయన పేరు పెట్టకపోతే జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత ఎన్టీఆర్ పేరుపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తూ వస్తే తాము చూస్తూ ఊరుకోమని శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. ఇంటలెక్చువల్స్ జిల్లా అధ్యక్షుడు అంగిరేకుల ఆదినారాయణ, మార్కాపురం నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు జంకె కృష్ణారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి గొలమారి సత్యనారాయణరెడ్డి, పబ్లిసిటీ ప్రచార కార్యదర్శి సింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి నాలి కొండయ్య యాదవ్, వార్డు ఇన్‌చార్జి ఉత్తమ్‌కుమార్, మార్కాపురం యూత్ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, పొదిలి ప్రచార కమిటీ అధ్యక్షుడు డేగ వెంకటరావు, జిల్లా స్టూడెంట్ సెక్రటరీ గుంటక అంజిరెడ్డి పాల్గొన్నారు.

రుణాల లక్ష్యాలు అమలు చేయాలి

- డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో కలెక్టర్ రాజాబాబు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు, పాల్గొన్న బ్యాంకుల అధికారులు

ఒంగోలు సబర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు సంబంధించి కేటాయించిన రుణాల లక్ష్యాలను కచ్చితంగా చేరుకోవాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (డీఎల్ఆర్‌సీ) బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేటాయించిన రుణ లక్ష్యాలు సాధించడంతో పాటు జిల్లాలో ఉపాధి కల్పన యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికంలో జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలుర కాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతి గురించి ఆయా బ్యాంకుల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఉపాధి కల్పన యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా పీఎంఈజీపీ, ముద్ర, పీఎం విశ్వకర్మ, తదితర కేంద్ర, రాష్ట్ర పథకాలకు సంబంధించిన రుణాల లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి నిర్దేశించిన లక్ష్యాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు, బ్యాంకర్లను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో లీడ్ జిల్లా మేనేజర్ రమేష్, డీఆర్డీఏ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్లు నారాయణ, శ్రీహరి, వ్యవసాయ, పశుసంవర్థక, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్లు శ్రీనివాసరావు, రవికుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, సీపీడీసీఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వరరావు, జిల్లా హార్టీకల్చర్ అధికారి గోపీచంద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, బ్యాంకు కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

బౌద్ధ స్థూపానికి బాగోగులు కరువు..!



తుప్పపట్టిన నేమ్ బోర్డు


నిరాదరణకు గురైన చందవరం బౌద్ధ స్థూపం


జిల్లాలో ప్రాచీన సంస్కృతికి నిలువెత్తు నిదర్శనంగా ఉన్న బౌద్ధ స్థూపం గురించి పట్టించుకునే వారు లేక శిథిలావస్థకు చేరింది. దొనకొండ మండలంలోని చందవరం సమీపంలో ఉన్న ఈ బౌద్ధ స్థూపం సుమారు 50 సంవత్సరాల క్రితం వెలుగుచూసింది. ఇక్కడ తవ్వకాల్లో లభించిన ఆధారాలను పరిశీలిస్తే బౌద్ధ విశ్వవిద్యాలయం, 60 ఎకరాలలో బౌద్ధ విహారాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇది అశోకుని కాలానికి ముందే నిర్మించిన స్థూపమని, అమరావతి స్థూపంకన్నా పెద్దదని, నాగార్జున కొండలోని స్థూపాలకన్నా ముందుదని భావిస్తున్నారు. మండల సరిహద్దు జగన్నాథపురం రెవెన్యూ గ్రామ పరిధిలో గుండ్లకమ్మ నది ఒడ్డున 1965వ సంవత్సరంలో బయటపడిన ఈ బౌద్ధ స్థూపం రాష్ట్రంలోనే పెద్దదిగా పేర్కొంటారు. శింగరకొండ నుంచి దక్షిణాన గల కాంచీపురం వెళ్లే ప్రాచీన రహదారిపై ఉండగా, రెండో శతాబ్దంలో శాతవాహన పాలనలో ఈ స్థూపాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. సుమారు 800 సంవత్సరాల పాటు ఇది ప్రముఖ బౌద్ధ ధార్మిక కేంద్రంగా, బౌద్ధ విశ్వవిద్యాలయంగా విరాజిల్లినట్లు తెలుస్తోంది. ఇలాంటి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఎంతో వెలుగొందే అవకాశం ఉన్నప్పటికీ పాలకులు, అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టక కళావిహీనంగా మారింది. దశబ్దాలుగా కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. 2022లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిధులు కేటాయించి మరమ్మతులు చేయించి పూర్వ వైభవం ఉట్టిపడేలా చర్యలు చేపట్టారు. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం, పర్యాటక శాఖాధికారులు పర్యవేక్షణా లోపం కారణంగా కనీసం కేర్ టేకర్ కూడా లేకపోవడంతో బౌద్ధ స్థూపం గోడలపై గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగాయి. గోడల మధ్య ఇటుక రాళ్లు ఊడిపోతున్నాయి. స్థూపం వద్దకు వెళ్లే దారి కూడా అధ్వానంగా ఉంది. మెట్లకు రాళ్లన్నీ పగిలిపోయి సందర్శకులు వెళ్లేందుకు కూడా దారి లేకుండా పోతోంది. ఇలాగే వదిలేస్తే భావితరాలకు ఫొటోల్లో మాత్రమే చూపించాల్సిన దుస్థితి నెలకొంది. నేడు పర్యాటక దినోత్సవం సందర్భంగా.. జిల్లాలో ఎంతో ఘన చరిత్ర కలిగిన బౌద్ధ స్థూపం గురించి పాలకులు, అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఉంది.

– సాక్షి, ఒంగోలు


బౌద్ధ స్థూపం గోడలపై పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డి



బౌద్ధ స్థూపం గోడలకు ఇటుకలు ఊడి శిథిలమవుతున్న దృశ్యం



అధ్వానంగా ఉన్న స్థూపం వద్దకు వెళ్లే మార్గం


నిరుపయోగంగా ఉన్న అతిథి గృహం, కేర్ టేకర్ భవనం

విద్యార్థుల మధ్య క్రికెట్ వార్

- రెండు గ్రూపులుగా విడిపోయిన విద్యార్థులు
- ఇద్దరికి గాయాలు

ఒంగోలు టౌన్: నగరంలోని ప్రముఖ రెసిడెన్షియల్ కాలేజీ విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. క్రికెట్ బెట్టింగ్ విషయంలో రెండు గ్రూపులుగా విడిపోయిన విద్యార్థులు రెచ్చిపోయి కొట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. పేర్నమిట్టలోని ఓ ప్రైవేటు జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న విద్యార్థుల మధ్య క్రికెట్ బెట్టింగ్ విషయంలో మనస్పర్థలు ఏర్పడినట్లు సమాచారం. రెండు గ్రూపులుగా విడిపోయిన విద్యార్థుల మధ్య కొంతకాలంగా వివాదాలు నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఘర్షణ జరిగింది. చొక్కాలు పట్టుకొని తీవ్రంగా కొట్టుకున్నట్లు సమాచారం. చేతికి అందిన వస్తువులతో చితక్కొట్టుకోవడంతో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఇద్దరి తలకు గాయం కావడంతో నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కుట్లు వేయించారు. కర్రలతో కొట్టడంతో తలకు గాయమైనట్లు క్షతగాత్రులు చెప్పడం గమనార్హం. తరగతి గదిలో కూర్చున్నప్పుడు ఒక విద్యార్థికి కాలు తగలడంతో గొడవ జరిగిందని, దాంతో ఇద్దరు విద్యార్థులు కొట్టుకున్నారని కళాశాల యాజమాన్యం చెబుతోంది. ప్రైవేటు కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ చిన్న గొడవ మాత్రమేనని, గ్యాంగ్ వార్ జరిగినట్లు సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు అసత్యాలని తాలుకా సీఐ విజయకృష్ణ ఒక ప్రకటనలో ఖండించారు.